
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

శనివారం 1 జూన్ 2024

రెండు విడతలుగా కొనసాగనున్న కార్యక్రమం

పల్లెల్లో పర్యటించనున్న ఉపాధ్యాయులు

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి

తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు

ప్రణాళిక సిద్ధం చేసిన విద్యాశాఖ

స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో బడిబాట నిర్వహిస్తున్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు (ఫైల్)



సార్లొస్తాండ్లు!

జూన్ 3 నుంచి 19 వరకు జిల్లాలో 'బడిబాట'

జనగామ కల్చరల్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా బడిబాట కార్యక్రమం నిర్వహించడానికి విద్యాశాఖ సిద్ధమైంది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీచేసింది. 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు గాను 'బడిబాట' నిర్వహించడానికి ఉన్నతాధికారులు ఏర్పాట్లను చేశారు. జూన్ 3 నుంచి 19 వరకు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రణాళిక ఇదే...

2024-25 విద్యా సంవత్సర ప్రారంభ నేపథ్యంలో బడిబాటకు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో కార్యాచరణ రూపొందిస్తారు. గ్రామాల్లో సభ నిర్వహించి బడిబాట ప్రాధాన్యతను తెలియజేస్తారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం బడిబాట నిర్వహిస్తారు. జూన్ 3 నుంచి 11వ తేదీ వరకు బడిబాట తొలి విడతగా నిర్వహిస్తారు. ఈ రోజుల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తిస్తారు. తరువాత 12 నుంచి 19 వరకు రోజుకో కార్యక్రమం చొప్పున ప్రణాళిక సిద్ధం చేశారు.

- జూన్ 3న గ్రామంలోని పలు యువజన సంఘాలు, మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తారు. బడీడు పిల్లలను గుర్తిస్తారు. స్వయం సహాయక సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో బడిబాట చైతన్య ర్యాలీ నిర్వహిస్తారు.
- 4న ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లల పేర్లను నమోదు చేసుకుంటారు. వారి జాబితాను తయారు చేసి సంబంధిత రిజిస్టరులో పొందుపరుస్తారు.
- 5 నుంచి 10 వరకు ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను ఎన్‌రోల్ చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులతో మాట్లాడడం, వారికి విద్యపై అవగాహన కల్పిస్తారు. బడి మానేసిన పిల్లలను, మానసిక వికలాంగ విద్యార్థులను గుర్తిస్తారు.
- 11న ఊరూరా గ్రామసభలు నిర్వహిస్తారు. జూన్ 5 నుంచి 10 వరకు గుర్తించిన పిల్లల జాబితాపై సమీక్ష చేస్తారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారు.
- 12న ఇప్పటి వరకు బడిబాట జరిగిన తీరుపై చర్చిస్తారు. పాఠశాలలను తోరణాలతో తీర్చిదిద్ది పండుగ వాతావరణం కల్పిస్తారు. బడిబాట ప్రాముఖ్యతపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తారు. కరపత్రాలు పంపిణీ చేస్తారు. తల్లిదండ్రులతో సమావేశమై 'అమ్మ ఆదర్శ పాఠశాల'లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు.
- 13న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ)పై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. లిప్ (లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) డే నిర్వహించి విద్యార్థుల సామర్థ్య స్థాయిలను వివరిస్తారు. ఆయా తరగతులకు అనుగుణంగా వాల్ పోస్టర్లు రూపొందిస్తారు.
- 14న విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. నూతనంగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి. పాఠశాల స్థాయిలో పిల్లల కమిటీలు, క్లబ్బులు ఏర్పాటు చేస్తారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలసభ నిర్వహిస్తారు.
- 15న ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులను, బడి బయట ఉన్న పిల్లలను గుర్తిస్తారు. వారి వివరాలు నమోదు చేసి పాఠశాలల్లో చేర్పిస్తారు. అవసరమైన వారిని భవిత సెంటర్లలో చేర్పిస్తారు.
- 18న పాఠశాలలో మొక్కల పెంపకానికి కావలసిన స్థలాన్ని ఎంపిక చేస్తారు. వాటి సంరక్షణ బాధ్యతలు విద్యార్థులు తీసుకునేలా అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆంగ్ల మాధ్యమంపై అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం 2022-23 నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన విషయాన్ని తెలియజేస్తారు. విద్యార్థులకు ద్విభాషా పుస్తకాల గురించి వివరిస్తారు.
- 19న క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ మొదలగు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తారు. తరగతుల వారీగా కాంపిటీషన్స్ నిర్వహిస్తారు.



చిన్నారులతో మాట్లాడుతున్న డీఈవో రాము

బడిబాటను విజయవంతం చేయాలి..: కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి



జిల్లాలో బడిబాట కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాం. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో నిర్వహించి విజయవంతం చేయాలి. గ్రామస్థులకు ఆంగ్ల మాధ్యమం, పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి వివరించాలి. అందరినీ కలుపుకుపోతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు గల వ్యత్యాసాలను తల్లిదండ్రులకు తెలియజేయాలి. బడిబాట కార్యక్రమానికి తల్లిదండ్రులు సహకరించాలి.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

(2023-24 విద్యా సంవత్సరం ఆధారంగా)

మొత్తం మండలాల సంఖ్య 12

కేటగిరీ	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	341	9,857
ప్రాథమికోన్నత	64	3,263
ఉన్నత	103	10,877
మొత్తం	**508**	**24,165**

అయ్యో.. బాబోయ్!

జిల్లాలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



జనగామ, మే 31 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. తెల్లవారుజామున 7 గంటల నుంచే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. జిల్లాలో శుక్రవారం అత్యధికంగా పాలకుర్తి మండలం వావిలాలలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం బచ్చన్నపేటలో అత్యధికంగా 44.5 డిగ్రీలు కాగా, శుక్రవారం 44.9 డిగ్రీలకు చేరింది. అదేవిధంగా బచ్చన్నపేటలో 44, దేవరుప్పులలో 43.9 డిగ్రీలు, జనగామలో 43.7, జఫర్‌ఘడ్‌లో 43.4 డిగ్రీలు, పాలకుర్తి, రఘునాథపల్లి, దేవరుప్పుల మండలం కోలుకొండలో 43.3 డిగ్రీలు, చిల్పూరు మండలం మల్కాపూర్‌లో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ రోజు జిల్లాలో వడదెబ్బ మరణాలు లేవు.

రాష్ట్ర చిహ్నాన్ని మార్చితే మరో ఉద్యమం

జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ చైర్‌పర్సన్ జమున



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున

జనగామ, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర చిహ్నాన్ని మార్చితే మరో ఉద్యమం జరుగుతుందని జడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర చిహ్నాన్ని, రాష్ట్ర గీతాన్ని మార్పుతామంటూ ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మభ్యపెడుతున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేయాలో ఆలోచించకుండా అనవసర పనులు చేస్తున్నారని విమర్శించారు. గొలుసుకట్టు చెరువుల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన కాకతీయులకు ప్రతీక అయిన కళాతోరణాన్ని తీసేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. వరంగల్, జనగామ ప్రాంతాలు పోరుగడ్డలని, అవసరమైతే ఇక్కడి నుంచే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 1, 2, 3 తేదీల్లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, తాళ్ల సురేశ్‌రెడ్డి, మేకల రాంప్రసాద్, కందుకూరి ప్రభాకర్, ఉడుగుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్డీవో ధరంసోత్ వెంకన్న



ఎంపీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, మే 31: వరంగల్‌లోని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జూన్ 4వ తేదీన ఎంపీ ఎన్నికల ఓట్ల లెక్కింపును సంబంధిత సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న అన్నారు. డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు సందర్భంగా సిబ్బంది అనుసరించాల్సిన విధి విధానాలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంట్రోల్ యూనిట్‌లో ఓట్లను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఓట్లను లెక్కించి పత్రాల్లో నమోదు చేసే క్రమంలో ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా చూసుకోవాలని తెలిపారు. ఒక క్రమ పద్ధతిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, సరస్వతి, అంజనేయులు, యోగేందర్, వినయలత, డీటీలు విజయ్‌కుమార్, రాజేష్, ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ప్రాణాలను హరిస్తుంది

డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్



పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 31: పొగ తాగడం, పొగాకు వాడకం ఆరోగ్యాన్నే కాదు.. ప్రాణాలను కూడా హరిస్తుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'పొగాకు కర్మాగారాలు-ఉత్పత్తుల నుంచి సంరక్షణ' అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. నో టుబాకో డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడారు. పొగ తాగడం, పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయన్నారు. పొగ తాగే వారి పక్కన ఉన్నా ఇవి సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. పొగాకు వాడకం అలవాటు నుంచి బయట పడడానికి మానసిక వైద్యుల సలహాలు, మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, వైద్యులు రవీందర్, భాస్కర్, అశోక్, జనార్దన్, సంధ్యారాణి, ప్రసన్న కృష్ణ, అజయ్‌కుమార్, సీహెచ్‌వో సాంబయ్య, డీపీఎంవో మురహరి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

- జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ విక్రమ్

చిలుపూర్, మే 31 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ విక్రమ్ అన్నారు. శుక్రవారం చిలుపూర్‌లోని ఎమ్మార్వీ భవనంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటల్లోపే ఆయా గ్రామాలతో పాటు, మండల కేంద్రంలో ప్రత్యేక అధికారులు జాతీయ జెండా ఆవిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దమొత్తంలో విద్యార్థులను చేర్పించాలని కల్పించాలని సూచించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తోందన్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. ఈ విషయంలో ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన చిన్నపెండ్యాల ఎస్సీ బీసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సురేశ్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంఎన్‌వో(మండల నోడల్ అధికారి) గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, హెచ్‌ఎంలు దారం శ్రీనివాస్, పురాణం రాజేందర్, కేతిరి నరసింహారెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, సంపత్, సీసీలు గట్టు శ్రీనివాస్, రమాదేవి, జీపీ సెక్రటరీలు శ్రీరంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, తండ రాంబాబు, వీవోఏలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా
- ఘన్‌పూర్, రాజవరంలో ఫర్టిలైజర్ షాపుల తనిఖీ
- వెంకటేశ్వర్లపల్లి పాఠశాలలో పనుల పరిశీలన



ఘన్‌పూర్‌లోని షాపులో పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు ఫోన్ చేసి మాట్లాడుతున్న కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్, మే 31: విత్తనాలను అధిక ధరలకు విక్రయించిన, గుర్తింపు లేని కంపెనీలకు సంబంధించిన నకిలీ విత్తనాలు అమ్మిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏ రకమైన విత్తనాలు రైతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు, కాలం చెల్లిన విత్తన ప్యాకెట్లు ఏమైనా ఉన్నాయా, పలాన విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేయాలని రైతులకు చెబుతున్నారా.. అని షాపు యజమానులను ప్రశ్నించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు సంబంధించిన వివరాల రిజిస్టర్‌ను కలెక్టర్ తీసుకొని వేలేరు మండలం సోడషపల్లి గ్రామానికి చెందిన జంగిటి కుమార్ అనే రైతుకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. పత్తి విత్తనాలు ఎంతకు తీసుకెళ్లారని అడిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టినా, ఎక్కువ ధరలకు అమ్మినా షాపులను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అన్ని రకాల పత్తి విత్తనాలలో బీజీ-2 జీన్ ఉంటుందని రైతులకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్, మండల వ్యవసాయాధికారి చంద్రన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయించొద్దు

చిలుపూర్ : నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని రాజవరంలో ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలు రకాల విత్తన సంచులు, ఎరువులు, క్రిమిసంహారక మందులతో పాటు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వెంకటేశ్వర్లపల్లిలో ప్రాథమిక పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మరమ్మతు, నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పనుల్లో వేగం పెంచేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం ఇప్పటికే పలు ఎరువుల దుకాణాల్లో సిద్ధంగా ఉంచిందన్నారు. ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువ రేటుకు ఎరువులను విక్రయించినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరస్వతిని ఆదేశించారు.

ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా బడిబాటను నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రాము, డీఏవో వినోద్‌కుమార్, తహసీల్దార్ ఎం.సరస్వతి, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఎమ్మార్ఐ కలువల శ్రీనివాస్, ఎంఎన్‌వో (మండల నోడల్ అధికారి) గోవర్ధన్, దారం శ్రీనివాస్, పురాణం రాజేందర్, పీఆర్ ఏఈ నరేష్‌కుమార్, ఐకేపీ ఏపీఎం ఈద రమేష్‌కుమార్, బిరుదురాజు కల్యాణి, సీసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలపై పోరాటం

- దేశంలో హిందువులు, ముస్లింలపై దాడులు
- వామపక్షాల బలోపేతానికి కార్యాచరణ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

జఫర్‌గఢ్, మే 31 : దేశంలో బీజేపీ అవలంబిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. జఫర్‌గఢ్ మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనలో హిందువులు, ముస్లింలపై దాడులు పెరిగిపోయాయన్నారు. హామీలను అమలు చేయడంలో, పేదల సంక్షేమంలో బీజేపీ సర్కార్ విఫలమైందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచి పెడుతున్నారన్నారు. మతోన్మాద రాజకీయాలు లౌకిక ప్రజాస్వామ్యంలో ఎప్పటికీ చెల్లబోవన్నారు. ఇలాంటి కుటిల రాజకీయాలు దేశానికి నష్టమన్నారు. ప్రజా పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని సాంబశివరావు అన్నారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ప్రజల ధిక్కార స్వరం మూగబోయిందన్నారు. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, హక్కులు, స్వేచ్ఛ కోసం, ప్రజా సమస్యలపై నిత్యం సాగించే ప్రజా ఉద్యమాలను అణచివేసి ప్రజా గొంతుకలను నొక్కేశారన్నారు. అయితే సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గొప్ప బాధ్యత ఉందన్నారు.

వామపక్ష పార్టీలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని కూనంనేని అన్నారు. పేదలు, కార్మికులు, కర్షకుల పక్షాన నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. రాబోయే ఎన్నికల నాటికి గణనీయమైన శక్తిగా ఎదిగేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించుకుంటున్నామన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కాగా, సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి సమక్షంలో మండలంలోని కూనూరుకు చెందిన 20 మంది వివిధ పార్టీల నాయకులు సీపీఐలో చేరినట్లు ప్రకటించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, మంగళంపల్లి జనార్దన్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మండల గట్టుమల్లు, పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్, మండల నాయకులు పెండ్యాల సమ్మయ్య, కూరపాటి చంద్రమౌళి, రడపాక సత్తయ్య, ఎండి.యాకూబ్, ఎండి.జాఫర్, మంద బుచ్చయ్య, శాగ యాదగిరి, బుల్లె దూడయ్య, ఆయా మండలాల పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు సిబ్బంది నియామకం

వరంగల్ కార్పొరేషన్, మే 31: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఎలాంటి బిల్లులు వసూలు చేసే అర్హత ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, ప్రైవేటు ఉద్యోగులకు లేదని సీడీఎంఏ హైదరాబాద్ నుంచి వరంగల్ బల్దియా కార్యాలయానికి సర్క్యులర్ అందిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మునిసిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వసూలు చేసిన డబ్బులను స్వప్రయోజనాల కోసం వాడుకుని చేతులెత్తేసినట్టు హైదరాబాద్‌కు ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు బల్దియా పరిధిలో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బందిని తొలగించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో డివిజన్‌కు ఒకరి చొప్పున 66 మంది, ఈ సేవా కేంద్రాలలో బిల్లులు వసూలు చేసేందుకు 10 మందిని నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో పని చేసి వీఆర్ఎలు, వీఆర్‌వోలుగా పని చేసిన వారిని ప్రభుత్వం పలు మున్సిపాలిటీలకు నియమించింది. కాగా, కొత్తగా నియమించబడిన వారు బిల్ కలెక్టర్లు, ఈ సేవా కేంద్రాల్లో వార్డు అధికారులుగా పని చేస్తారు. కాగా, కమిషనర్ నియమించిన వారి పేర్లతో కూడిన జాబితాను అధికారికంగా విడుదల చేశారు. అయితే తొలగించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొదట ఏ విభాగంలో నియమించబడ్డారో అదే స్థానానికి పంపిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఎక్కువ మంది శానిటేషన్ విభాగంలో పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లు ఉండడంతో తేలు కుట్టిన దొంగల్లా కొట్టుమిట్టాడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్ఐ మునీరుల్లా, ఏఎస్ఐలు నమ్మలాల్, శ్యామ్‌సుందర్, సమ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ యాకూబ్‌రెడ్డిలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. కుటుంబసభ్యులు ఇచ్చిన సహకారంతో పోలీసులు వారి విధుల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం, యోగం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, స్పర్శన్‌రాజ్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్



హసన్‌పర్తి, మే 31: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన రౌతు రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రమేశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్ (దేవన్నపేట), రాష్ట్ర కమిటీ సభ్యులుగా బొర్ర సంపూర్ణ (హసన్‌పర్తి), మేకల అనిత (హసన్‌పర్తి), భిక్షపతి, కొమ్ముల కరుణాకర్, సురేష్, విజయకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో డీబీఎఫ్ భాగస్వామ్యం ఉంటుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు, విద్యా చైతన్య ఉద్యమాలను చేపడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



ఐలయ్య (ఫైల్)

చెన్నారావుపేట, మే 31: వడదెబ్బతో వృద్ధుడు గురువారం రాత్రి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పల్లకొండ ఐలయ్య(75) వడ పందుల కాపరిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య గతంలోనే చనిపోగా, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం పందులను మేపడానికి ఆరు బయటకు తీసుకెళ్లాడు. రోజంతా ఎండలోనే ఉన్నాడు. సాయంత్రం ఇంటికి రాగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరోచనాలు కావటంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తరలించారు. అనంతరం ఆస్పత్రి తరలించేందుకు యత్నిస్తుండగా అప్పటికే మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఏకలవ్య సంఘం బాధ్యులు రూ.3 వేలను ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షుడు పులిచేరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి, కార్యదర్శి రాయపురి శ్రీను, పల్లకొండ కుమారస్వామి, వెంకటేష్, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

» వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
» అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
» కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు..? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

» టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

» ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. 'ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిలరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

» రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

» అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

» అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగష్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడి పడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

» కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
» మహేష్ కుమార్ గౌడ్
» సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ.వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మీ, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

» అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
» ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
» లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
» 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
» విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
» సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని జోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరంన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోజుకు రూ.300 వేతనం పడేలా పనిచేయాలి



తమ్మడపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్

బచ్చన్నపేట, మే 31 : ఉపాధి పనులకు వచ్చే కూలీలు రూ.300 రోజువారి వేతనం వచ్చేలా పనిచేయాలని అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో శుక్రవారం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటంతో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఉదయం పనులకు తొందరగా వచ్చి, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు పూర్తిచేసి వెళ్లాలన్నారు. ఉపాధి పనికి పెద్ద సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా ఈజీఎస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీవోకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

రఘునాథపల్లి, మే 31: మండలంలోని కోమల్ల గ్రామంలో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అధ్యయన బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిసాయి. ఆలయ ధర్మకర్త ఉత్తలూరి అనిల్‌బాబు, వేదపండితులు లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల చివరి రోజు వేదమంత్రాలతో మహా పూర్ణాహుతి, శ్రీపుష్ప యాగం, ధ్వజారోహణం నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పానుగంటి గోపాల్‌కిషన్‌రావు, సుల్తాన్ నర్సింహారెడ్డి, తాటికొండ వెంకటేష్ యాదవ్, బొల్లపల్లి కుమారస్వామి, సుమన్, ఉపేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



పట్టణంలో వైకుంఠధామాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ కల్చరల్, మే 31: జిల్లా కేంద్రంలోని మోడ్రన్ వైకుంఠధామాన్ని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకుంఠధామంలో జరిగే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. రోడ్డు మార్గం పనులు, గేట్ వంటివి పటిష్ఠంగా ఉండాలని, మొక్కలు నాటాలని, వాటికి సంబంధించి సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాము తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే ప్రజా సమస్యల పరిష్కారం

▸▸ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్

స్టేషన్‌ఘన్‌పూర్, మే 31: ప్రజా సమస్యల పరిష్కారం సీపీఎంతోనే సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎమ్డీ.అబ్బాస్ తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్క్సిజంతోనే సమాజంలో దోపిడి అంతమవుతుందన్నారు. కార్మికుల శ్రమ శక్తితో పెట్టుబడిదారులు దోపిడి చేస్తున్నారన్నారు. పాలకవర్గాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ కోట్ల రూపాయల రుణాలను, దేశ సంపదను అప్పనంగా దోచిపెడుతున్నారని తెలిపారు. ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారం చూపేది మార్క్సిజమే అని తెలిపారు. మండల కార్యదర్శి మునిగెల రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, ఇర్రి అహల్య, యాదగిరి, రాపర్తి రాజు, రమేష్, బూడిద గోపి, జోగు ప్రకాష్, విజేందర్, ఉపేందర్, గట్ల మల్లారెడ్డి, కొడెపాక యాకయ్య, నరేందర్, ఎమ్డీ. షబానా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి



పాలకుర్తిలోని గ్రోమోర్‌లో తనిఖీ చేసి పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేటలో విత్తన షాపులో తనిఖీ చేస్తున్న మండల టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం



జఫర్‌గడ్‌లో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీపీ నర్సయ్య, తహసీల్దార్

▸▸ అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

▸▸ విత్తన షాపులను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు

పాలకుర్తి, మే 31 : అదను సమీపిస్తుండడంతో అన్ని రకాల పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులు, పెస్టిసైడ్‌ల రికార్డులు సక్రమంగా ఉండేలా వ్యవసాయాధికారులు పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశం, ఏడీఏ పరశురాం, వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఏఈవో వెంకటేష్, ఉన్నారు.

- నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌తో పాటు లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరత రాకుండా చూడాలని, ఒకవేళ కొరత సృష్టిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
- బచ్చన్నపేట: బచ్చన్నపేటలోని విత్తన షాపులను రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పోలీసులు టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. శివశంకర్ ఫర్టిలైజర్ షాపులో మహికో కంపెనీకి చెందిన జుంగి, దండర్ పత్తి రకాలకు చెందిన 180 ప్యాకెట్ల ఇన్‌వాయిస్‌లు, డెలివరీ చాలన్, ప్రిన్సిపల్ సర్టిఫికెట్‌లు సరిగా లేని కారణంగా సీడ్ యాక్ట్ ప్రకారం స్టాప్‌సేల్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. రైతులకు విక్రయించిన విత్తనాలను డీలర్లు రిజిస్టర్‌లో నమోదు చేసి ప్రతిరోజు ఉదయం 10 గంటల లోపు వ్యవసాయాధికారికి అందించాలన్నారు. బ్లాక్ మార్కెట్ చేయకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఏవో విద్యాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
- నర్మెట : నర్మెట మండల కేంద్రంలోని విత్తన షాపులను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ విత్తన షాపులలో రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. విడి విత్తనాలను విక్రయించవద్దన్నారు. ఎవరైనా బీటీ త్రీ విత్తనాలు అమ్ముతున్నారని తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సంతోషి తదితరులు పాల్గొన్నారు.
- లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల ఎస్ఎస్ అగ్రిమాల్ ఎరువుల దుకాణంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు కంపనీల విత్తనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో పాటుగా రిజిస్టర్ రికార్డులు సరిగా రాయడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో రూ. 40,608 విలువైన పత్తి విత్తనాలు విక్రయించకుండా స్టాప్‌సేల్ నోటీసులను జారీ చేశారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం సీఐ శ్రీనివాస్‌యాదవ్, తహసీల్దార్ వినయలత, ఎస్సై రాజు, ఏవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- తరిగొప్పుల : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి డి.సంతోష హెచ్చరించారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర, శ్రీరామ ఫర్టిలైజర్ షాపులను ఎస్సై అయ్యల శ్వేత, తహసీల్దార్ కిష్టయ్యతో కలిసి సందర్శించి స్టాక్ మెనూను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఎవరైనా లూజు విత్తనాలు గాని, రశీదులు లేకుండా గాని విత్తనాలను విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మార్కెట్‌లో ప్రమాదకర బీటీ 3 విత్తనాలను విక్రయిస్తే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ప్రశాంత్, రేష్మ తదితరులు పాల్గొన్నారు.
- కొడకండ్ల : నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అంజయ్య విత్తన దుకాణాల యజమానులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను ఎస్ఐ శ్రవణ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొన్నప్పుడు ఎట్టిపరిస్థితుల్లో బిల్లు తీసుకుని జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచించారు. విత్తనాలు నకిలీ అని తేలినప్పుడు ఆట్టి బిల్లు సహకారంతో దుకాణదారుపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.
- జఫర్‌గడ్ : విత్తనాలు, ఎరువుల విక్రయంలో దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆదేశించారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎస్ఐ శీలం రవియాదవ్, ఏఈవో శిరీషతో కలిసి జఫర్‌గడ్‌లోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను సందర్శించి తనిఖీ చేశారు. సరఫరాను బట్టి విక్రయాలు జరుగుతున్నాయా.. లేదా పరిశీలించారు. దుకాణాల్లో ఎరువులు, విత్తనాల క్రయవిక్రయ రిజిస్టర్లు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను విక్రయించవద్దన్నారు. పంటల విస్తీర్ణం మేరకు ఎరువులు, విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

జనగామ కల్చరల్, మే 31 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిసినట్లు డీఐఈవో కె. ఆంజనేయరాజు తెలిపారు. చివరి రోజు ఉదయం ఫస్టియర్ జనరల్ విభాగంలో 906 మందికి 844 మంది, ఒకేషనల్ విభాగంలో 8 మందికి ముగ్గురు, మధ్యాహ్నం సెకండియర్ జనరల్ విభాగంలో 389 మందికి 371, ఒకేషనల్ విభాగంలో 16 మందికి 10 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన కళాశాలల యాజమాన్యాలకు, అధికారులకు, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

2న 'జనగామ కలం గళం' విడుదల

జనగామ కల్చరల్, మే 31 : కల్చరల్ క్రియేటివ్ ఛానల్ ఆధ్వర్యంలో జూన్ 2న 'జనగామ కలం గళం' అనే కార్యక్రమాన్ని యూట్యూబ్ ద్వారా విడుదల చేస్తున్నట్లు కవులు, కళాకారుల ఐక్యవేదిక కన్వీనర్ జి.కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై కలం, గళం విప్పిన కార్యక్రమాన్ని యూట్యూబ్ ద్వారా వీక్షించాలని, ప్రతి ఒక్కరూ ఛానల్‌లో సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, దశరథ్ నాయక్, లగిశెట్టి ప్రభాకర్, కోడం కుమారస్వామి, కొట్టె శ్రీలత, రంగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

పాలకుర్తి, మే 31 : మండలంలోని ఈరవెన్ను గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సాయం అందచేశారు. గ్రామానికి చెందిన దామెర స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. తమతో కలిసి చదివిన బాల్య మిత్రుడు స్వామి కుటుంబానికి అండగా నిలవాలని భావించిన పూర్వ విద్యార్థులు రూ. 65వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబసభ్యులకు అందచేశారు. బాల్య స్నేహితుడికి చేయూత అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పోతన గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

పాలకుర్తి, మే 31 : ఈ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షల కోసం చదవడానికి పుస్తకాలను అందజేసినట్లు తెలంగాణ గ్రంథాలయ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్. లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని బమ్మెర గ్రామంలో పోతన పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి శుక్రవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతన ఊరిలో జన్మించిన ప్రతి విద్యార్థికి ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీనివాస్,ఉపేందర్, సోమయ్య పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన విద్యుత్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తరిగొప్పుల, మే 31 : ఆరుగాలం కష్టపడి రైతులు వ్యవసాయం చేస్తుండగా, అధికారుల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో 'అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం' అనే కథనం శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో విద్యుత్ శాఖ జిల్లా యంత్రాంగం కదిలింది. ఏడీఈ రఘునాథపల్లి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని అబ్దుల్‌నాగారం గ్రామానికి చెందిన కావటి సుధాకర్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు రైతు పొలంలో మరమ్మతులు చేయకుండా బిగించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను జనగామ ఎస్‌పీఎం కార్యాలయానికి పంపించి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకువచ్చి బిగించి ఇబ్బందులను తొలగించారు. ఈసందర్భంగా రైతు కావటి సుధాకర్ మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి కథనానికి విద్యుత్ అధికారులు స్పందించడంతో కృతజ్ఞతలు తెలిపాడు. ఈ కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ ఎంఎల్ రెడ్డి, డీఈ ఎమ్మార్టీ విజయ్‌కుమార్, ఏఈ నాగేందర్, సబ్ ఇంజనీర్ మన్విత్, లైన్‌మన్ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్న విద్యుత్ అధికారులు

బడిబాటను విజయవంతం చేయాలి



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమాదేవి


జనగామ కల్చరల్, మే 31: బడిబాట మనందరి బాధ్యత అని మండల నోడల్ అధికారి వంగాల రాజేందర్ అన్నారు. శుక్రవారం జనగామ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల స్థాయి బడిబాట సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడీడు పిల్లలను బడికి రప్పించి అందరూ కలిసికట్టుగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తారని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తారన్నారు. జూన్ 3 నుంచి 19 వరకు ఇంటింటా ప్రచార ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేసి షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీవో సంపత్, నరేందర్, ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు.

- బచ్చన్నపేట : మండలంలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ శాఖల బాధ్యులు కృషి చేయాలని తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, నోడల్ ఆఫీసర్ మూర్తిలు కోరారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 3 నుంచి 19 వరకు గ్రామాలలో నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.
- కొడకండ్ల : మండలంలో బడిబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేందుకు పిల్లలను చేర్పడానికి కృషి చేయాలని కోరారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నాగేషు సూరి, ఎంఎన్‌వో గ్రేస్ కేజియారాణి, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- పాలకుర్తి : ఈ నెల 3 నుంచి 19 వరకు నిర్వహించే బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశానికి రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బాధ్యతగా భావించి ప్రతి విద్యార్థి బడిలో చేరేలా చూడాలని అన్నారు. మండలంలో 30 అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు పనులు పూర్తి అయ్యాయని అన్నారు. సమావేశంలో మండల నోడల్‌అధికారి శోభారాణి, పుష్పలత, నరేందర్, సంక్షేమ అధికారులు అనిల్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జత్యత, సంధ్యారాణి, తాడూరి రమేష్, నరేష్, సునిత పాల్గొన్నారు.
- దేవరుప్పుల : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నోడల్ ఆఫీసర్ సీహెచ్. ఉపేందర్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 3 నుంచి బడిబాట కార్యక్రమంలో భాగంగా పిల్లలను పాఠశాలలకు చేర్పడం గురించి, మౌలిక వసతుల కల్పన వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, విద్యుత్ ఏఈ సుధాకర్, ఐకేపీ ఏపీఎం వెంకటరెడ్డి, నల్ల ఉమ తదితరులు పాల్గొన్నారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : ఈ నెల 3 నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించి సహకరించాలని ఎంపీడీవో ఉమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నోడల్ అధికారి జి.కొమురయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి బడి బాట సన్నాహక సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. బడి బయట పిల్లలను, డ్రాపౌట్లను, 5ఏళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించడానికి హెచ్‌ఎంలు, టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జీపీ సిబ్బంది, గ్రామాల్లో అన్ని వర్గాల సహకారంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో సీడీపీవో ఫ్లారెన్స్, డీటీ విజయ్‌కుమార్, డీపీఎం సుధీర్, ఏపీఎం కుమార్, సీఆర్‌పీలు గిరి, వెంకటేశ్వర్లు, లవన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

రఘునాథపల్లి, మే 31: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన ఊరడి కృష్ణమూర్తి(73) అనే వృద్ధుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ నిడిగొండ రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య లక్ష్మి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

ఆలీంపూర్‌లో యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన సాయి

బచ్చన్నపేట, మే 31 : కుటుంబ కలహాల వల్ల భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన పాకాల సాయి (28)-మమత దంపతుల మధ్య గత కొంత కాలంగా తరచూ గొడవలు జరుగుతుండటంతో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి సర్ది చెప్పారు. మళ్లీ ఇటీవల గొడవ జరగడంతో భార్య మమత పుట్టింటికి వెళ్లిపోయినట్టు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన సాయి శుక్రవారం తెల్లవారుజామున వ్యవసాయ బావివద్ద ఉరి వేసుకుని చనిపోయినట్లు చెప్పారు. సాయి తండ్రి పాకాల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

కులగణన చేపట్టాలి

పాలకుర్తి, మే 31 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే బీసీ కుల గణనను వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని కల్లుగీత సహకార సంఘం భవనంలో మీడియా సమావేశంలో రవికృష్ణ గౌడ్ మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఏ కులాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని, అభివృద్ధికి ఏ కులాలు దూరంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ బీసీ కుల గణనను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు సంగి వెంకన్న, రాజు గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి బాక్సింగ్ శిక్షణా శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మే 31 : స్టేషన్ ఘన్‌పూర్‌లోని హైస్కూల్‌లో జిల్లా క్రీడా సాధికారిక సంఘం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి బాక్సింగ్ శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థులకు స్థానిక గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ లయన్ చింతకుంట్ల బాస్కర్‌రెడ్డి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు శారీరక, మానసిక వికాసానికి ఇష్టమైన ఆటలను ఎంపిక చేసుకుని సాధన చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ రాజు, పెసరు సారయ్య, మనోహర్, మనోజ్, జి.రాజు, శ్రీకిరణ్, రాజేందర్, అశోక్, చంద్రశేఖర్ రెడ్డి, రఘు, చందర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల తనిఖీ

నర్మెట, మే 31 : మండలంలోని మాన్‌సింగ్‌తండాలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం జిల్లాకు రూ.10 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. పాఠశాలల సమస్యల పరిష్కారంలో కమిటీలు ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఈవో కె.రాము, పీఆర్ డీఈ కృష్ణకుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అరవింద్‌చౌదరి పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారిపై ఆరోపణలను ఖండిస్తున్నాం

▸▸ గోపా వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు

జనగామ కల్చరల్, మే 31 : తెలంగాణ విద్యాశాఖలో పని చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశంపై వచ్చిన అవినీతి ఆరోపణలను గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(గోపా) జనగామ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్న పరశురాములు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. నీతి నిజాయితీ, నిబద్ధతకు మారుపేరుగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశంపై అవినీతి ఆరోపణలు చేయడం తెలంగాణ బీసీ సమాజాన్ని కించపర్చడమేనన్నారు. అవగాహన లేమితో అసంబద్ధ ఆరోపణలు చేస్తూ లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా కథనం అల్లడం పాత్రికేయ వృత్తికి తగదని అన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

లింగాలఘణపురం, మే 31: మండలంలోని నెల్లుట్ల, వడ్డిచర్ల గ్రామాల్లో శుక్రవారం హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. నెల్లుట్లలో అర్చకులు మనోహర్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా, వడ్డిచర్లలో మండలకాలం దీక్షను పూర్తి చేసుకున్న మాలధారణ భక్తులు ఇరుముడితో కొండగట్టు, విజయవాడ పుణ్యక్షేత్రాలకు బయలుదేరారు.

రైతుల పరిస్థితిని కలెక్టర్‌కు వివరిస్తా : ఆర్డీవో



గొల్లపల్లి వాగును పరిశీలిస్తున్న జనగామ ఆర్డీవో కొమురయ్య

దేవరుప్పుల, మే 31 : మండలంలోని గొల్లపల్లి వాగులో ఇసుక తోడకుండా రైతులు అడ్డుకోగా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీవో కొమురయ్య వాగును సందర్శించారు. మొదటగా తహసీల్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవోతో రైతులు మాట్లాడారు. గతంలోనే దేవరుప్పుల మండలం డార్క్ ఏరియాగా ప్రభుత్వమే ప్రకటించిందని, అందువల్ల గత ప్రభుత్వం రైతు సంక్షేమం దృష్టిలో ఉంచుకుని కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి చెక్‌డ్యామ్‌లు నిర్మించిందన్నారు. వాగులోని ఇసుకను తోడటం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి రోడ్డున పడతామని మొరపెట్టుకున్నారు. వాగులో నీరు ఉంటేనే పంటలు పండుతాయన్నారు. వాగులో తాము చేతిబోర్లు వేసుకున్నామన్నారు. ఇసుకను తోడితే ఏడారి ప్రాంతవుతుందన్నారు. స్పందించిన ఆర్డీవో జనగామ ఇరిగేషన్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడి పరిస్థితి ఏంటని, రైతులు అడ్డుకుంటున్నారని, ఇసుకను తోడితే నష్టపోతున్నామని చెబుతున్నారన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడాక ఇసుకను తోడుకెళ్తే బాగుండేదన్నారు. చెక్‌డ్యామ్ వద్ద ఇసుక మేటలు వేసిందని, అట్టి ఇసుకను మాత్రమే తోడుతున్నట్టు ఈఈ ఆర్డీవోకు వివరించారు. రైతులు మాట్లాడుతూ అక్కడ ఇసుక లేదని, ఇసుక లెవల్‌లోనే చెక్‌డ్యామ్ నిర్మించారని ఆర్డీవోకు తెలిపారు. అనుమతులు వెంటనే రద్దు చేయాలని కోరారు. ఆర్డీవో మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితి చూసేందుకే వచ్చానని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హస్సేన్, డీటీ నవీన్‌కుమార్, ఆర్ఐలు రాజు, ఆంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.